క్లుప్తంగా

శంభుని ఆలయంలో ప్రత్యేక పూజలు



వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని రోళ్లకల్ గ్రామంలో గల శంభుని ఆలయంలో మహాశివ రాత్రిని పురస్కరించుకుని భక్తులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం గ్రామంలో స్వామి వారిని ఊరేగించారు. మాజీ సర్పంచ్ సమ్మయ్య, మూడు ప్రతాప్‌గౌడ్, జనగాం రాజయ్య, రత్నంబాబు, రాజగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలోని నీరటి సమ్మయ్య ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధం అయింది. ఫ్రిడ్జ్ ప్లగ్ వద్ద మంటలు చెలరేగి క్షణాల్లో ఇంటిల్లి పాది మంటలు వ్యాపించాయి. ఇంట్లో విద్యుత్ వైరింగ్ మొత్తం కాలిపోయింది. కుటుంబ సభ్యులు ఆదివారం బయటకు వెళ్లి ఇంటికి చేరుకునే సరికి మంటలు వస్తుండడంతో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపేసి బిందెలతో నీటిని చల్లి మంటలను ఆర్పారు.

గ్యాస్ సిలిండర్ పేలి..

నర్సంపేట రూరల్ : గ్యాస్ సిలిండర్ పేలి రూ.20వేల ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన దూపటి రాజేష్ ఇంటిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తాపీమేస్త్రీ భాస్కర్‌కు గత రెండు నెలల క్రితం కిరాయికి ఇచ్చాడు. అయితే ఆదివారం సాయంత్రం వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ వద్ద మంటలు వచ్చి సిలిండర్ పేలిపోయింది. దీంతో ఇంట్లో దుస్తువులు, సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. వీటి విలువ రూ.20వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రగతి గురుకుల విద్యాలయంలో 2004–05సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నాటి పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో సూర్యప్రకాశ్, సుబ్బారావు, సంతోష్, ఆసీఫ్, కోరె రాము, సురేష్, నరేష్, పూర్ణచందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి గేదె మృతి



చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లిలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఆదివారం పాడి గేదె మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన నమిండ్ల కొమ్మాలుకు చెందిన గేదె ఇంటి వెనకాల ఉన్న సంపు పక్కన గడ్డి మేస్తు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందింది. గేదె విలువ సుమారుగా రూ.60 వేల వరకు ఉంటుందని బాధితుడు కొమ్మాలు తెలిపాడు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పరకాల : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆదివారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో గల రాజీపేటలో వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. వార్డు ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్న ఆయన పరకాల అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తే లేదని, కావాల్సిన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకు రావడానికి కృషిచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, మాధారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, కౌన్సిలర్ దామెర మొగిళి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగు భూముల్లో అక్రమ వెంచర్లు

- మండలంలో జోరుగా రియల్ దందా
- రియల్టర్లు, అధికారుల కుమ్మక్కు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



గిర్నిబావిలోని వరంగల్–నర్సంపేట రోడ్డు పక్కన వ్యవసాయ భూమిలో వెలసిన వెంచర్

దుగ్గొండి : గ్రామాల్లో రోడ్ల పక్కన ఉన్న సాగుభూముల్లో అక్రమంగా వెంచర్లు వెలుస్తున్నాయి.. గుంట, రెండు గుంటల పేరుతో దర్జాగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమయిన వెంచర్‌లు నేడు గ్రామాలలో అధికంగా దర్శనమిస్తున్నాయి. తక్కువ ధరలకు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆధారం చేసుకుని ప్లాట్లను గుంటల రూపంలో కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ చేయిస్తూ నాలా రుసుము ఎగనామం పెడుతున్నారు. ఈ దందాలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారుల అండదండలు ఉండటంతో రియల్ వ్యాపారం కాస్తా మూడు ప్లాట్లు–ఆరు వెంచర్‌లుగా విరాజిల్లుతోంది.

మండలంలోని గిర్నిబావిలో వరంగల్–నర్సంపేట రోడ్డు, గిర్నిబావి–దుగ్గొండి రోడ్డు, గిర్నిబావి చాపలబండ రోడ్లకు ఇరువైపులా పదుల సంఖ్యలో అనుమతులు లేని వెంచర్‌లు వెలుస్తున్నాయి. వ్యవసాయ భూములను చదును చేయడం దానికి మ్యాపును తయారు చేసి పేపర్‌పైనే కొనుగోలు దారులకు విక్రయిస్తున్నారు. అనంతరం కొనుగోలు దారులకు గుంట, గుంటన్నర, రెండు గుంటలు ఇలా ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఫలితంగా నాలా రుసుముకు కన్నం వేస్తున్నారు. గుంట రిజిస్ట్రేషన్‌లు ప్రతిరోజు వస్తుండటంతో రెవెన్యూ అధికారులు తిరకాసు పెట్టడంతో వారికి కాసులు ఇచ్చి ప్రసన్నం చేసుకుంటున్నారనే బహిరంగ చర్చ జరుగుతుంది. ఇందుకు రెవెన్యూ వారికి రూ.5వేల నుంచి రూ.10వేల ముట్టజెబుతున్నారని వినికిడి. అయితే నాలా లేకుండా, జీపీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించుకోవడం కష్టమని తెలిసినా దందా మాత్రం ఆగడం లేదు. ఇదిలా ఉండగా గిర్నిబావికి అర కిలోమీటరు సమీపంలో నాచినపల్లి రెవెన్యూ పరిధిలో ఓ రియల్టర్ వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి దానిని అందంగా రంగులతో మ్యాపు చేయించి ఎలాంటి అనుమతులు లేకున్నా బంఫర్ ఆఫర్ అని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటూ విక్రయాలు మొదలుపెట్టాడు. ఇంత జరుగుతున్నా వెంచర్‌లకు అనుమతులు తీసుకోకున్నా.. గ్రీన్ ల్యాండ్ ఊసే లేకున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నాలా ఫీజు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్



కొందరు గుంట, రెండు గుంటలు రిజిస్ట్రేషన్‌ల కోసం మీసేవా కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకుంటున్నారు. గ్రామాలలో వ్యవసాయం చేసుకునే భూములు అయితే రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. ప్రధాన రహదారుల పక్కన ఉన్న భూములు అయితే నాలా ఫీజు చెల్లించినట్లు రశీదు తెస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. ఎవరికి మినహాయింపులు ఉండవు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే సహించేది లేదు.

\- సంపత్‌కుమార్, తహసీల్దార్, దుగ్గొండి

అనుమతి లేనిది కొనుగోలు చేయొద్దు



ప్రధాన రహదారుల వెంట అనేక చోట్ల వెంచర్లు వెలుస్తున్నాయని తమ దృష్టికి రాగానే అనుమతి లేని వాటిని వెంటనే రాళ్లు తొలగించి అనుమతి లేని వెంచర్ అని బోర్డులు పెడుతున్నాం. లే అవుట్ లేకుండా, గ్రీన్‌లాండ్ కేటాయించకుండా, నాలా ఫీజు చెల్లించకుండా ఉన్న వెంచర్‌లలో ఎవరూ కొనుగోలు చేసినా చివరికి వారే నష్టపోతారు. నిర్మాణాలకు అనుమతులు రావు. గిర్నిబావిలో అనుమతి లేని గృహాల యజమానులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం.

\-మోడెం శ్రీధర్, మండల పంచాయతీ అధికారి

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లతో ప్రజలపై భారం

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేష్



కుంటపల్లిలో మాట్లాడుతున్న పెద్దరాపు రమేష్

సంగెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లతో ప్రజలపై భారాలే తప్ప ఫలితం లేదని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దరాపు రమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కుంటపల్లిలో మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టినా సగటు మనిషి అవరాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంకెల గారడీతో ప్రభుత్వాలు ప్రజలను మభ్య పెడుతున్నాయన్నారు. గత ఎన్నికల హామీలను నెరవేర్చకుండానే కొత్త హామీలతో మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సమస్యలపై స్పందించి పోరాటలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి మంద రవి, మండల కార్యదర్శి ఇస్మాయిల్ నాయకులు కుమారస్వామి, గోనే రాంచందర్, రౌతు సాంబయ్య, రేణుక కుమారస్వామి పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి సాంబరెడ్డి కృషి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్ది తదితరులు

చెన్నారావుపేట : చెన్నారావుపేట సహకార సంఘం అభివృద్ధికి రాధారపు సాంబరెడ్డి కృషి చేశాడని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సాంబరెడ్డి సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంబరెడ్డి సహకార ఉద్యమానికి, రైతాంగం, పొదుపు సంఘాలు, సొసైటీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని సంఘాల అభివృద్ధికి జీవితాంతం కృషి చేశాడన్నారు. సహకార సంఘం కమ్యూనిటీహాల్ నిర్మించడమే లక్ష్యంగా, ఆయన ఆశయాన్ని కొనసాగించడానికి రూ.50లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాదావత్ విజేందర్, జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, గెజిటెడ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జగన్‌మోహన్ రావు, కీరు నాయక్, వెంకటేశ్వర్లు, చింతకింది వంశీ, మహ్మద్ రఫి, గఫ్ఫార్, సర్పంచ్ కుండె మల్లయ్య, సీఈఓ రవి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

యాది సభను జయప్రదం చేయాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

చెన్నారావుపేట : కాకతీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కందాల శోభారాణి యాది సభను జయప్రదం చేయాలని పాపయ్యపేట గ్రామ ఆర్ఎంపీ డాక్టర్ కత్తి స్వామిగౌడ్, బోడ రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం యువకులు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని పాపయ్యపేటలో నేడు(సోమవారం) శోభారాణి యాదిసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాది సభకు యూనివర్సిటీ సీడీసీ డీన్ ప్రొఫెసర్ రామచంద్రం, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఈసం నారాయణ, సాదు రాజేష్, రమేష్, కౌశిక్‌లతో పాటు కుటుంబ సభ్యులు, యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు, కళాకారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మొర్రి రాజు, కన్నం మదార్, యాకయ్య, నారాయణ, గాలి శ్రీనివాస్, అలువాల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక గురువు సేవాలాల్



గిరిజనులతో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : సంత్ సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తితో తండాల అభివృద్ధికి కృషి చేస్తానని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి సందర్భంగా భోగ్ భండారో కార్యక్రమం చేపట్టారు. ఆదివారం పట్టణంలోని మాధన్నపేట రోడ్డులో గల సేవాలాల్ మందిరంలో పూజలు చేసిన అనంతరం సిటిజన్స్ క్లబ్‌లో ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ సామాజిక ఉద్యమకారుడని, లంబాడీలను ఏకం చేసి గొప్ప సంస్కృతిని జీవనవిధానాన్ని బోధించిన ఆధ్యాత్మిక గురువుగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. వారి జీవితం నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని తండాలకు సాగు, తాగునీరు, నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు, అన్ని తండాలకు రవాణా సౌకర్యం కోసం బీటీ రోడ్లు, సీసీ రోడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించడం, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవతో నర్సంపేట నియోజకవర్గానికి గిరిజన సైనిక్ స్కూల్, డిగ్రీ కళాశాలతో పాటు బాలికల కోసం హాస్టల్‌ను తీసుకు వచ్చామన్నారు. అనేక మంది యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామి నాయక్, సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ ఉదయ్‌సింగ్, సంగులాల్, ఆంగోత్ భద్రయ్య, తేజావత్ వాసు నాయక్, జేతురాం నాయక్, భూక్యా జగన్‌నాయక్, సుభాష్ నాయక్, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్‌లు, గోర్ బంజారా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సాయన్న మృతికి సంతాపం

నర్సంపేట : సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందగా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయన్న మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నెమలి అప్పగింత

శాయంపేట : మండలంలోని సూర్య నాయక్ తండా గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రెడ్యా నాయక్ ఆదివారం తాను సాగు చేస్తున్న పోడు భూమి పత్తిపంటల్లో అస్వస్థతకు గురైన జాతీయ పక్షి నెమలిని గుర్తించాడు. వెంటనే నెమలిని పట్టుకొని స్థానిక సర్పంచ్ భూక్యా రమేష్ వద్దకు వెళ్లగా అతను ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. దీంతో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రావుల మైసయ్య, బీట్ ఆఫీసర్ పోశాలు గ్రామానికి చేరుకున్నారు. సర్పంచ్ సమక్షంలో ఫారెస్టు అధికారులకు నెమలిని అప్పగించారు. నెమలిని స్వాధీనం చేసుకొని హనుమకొండలోని వన విజ్ఞాన్‌కు తరలించి చికిత్స చేయించి అక్కడే అప్పగించడం జరుగుతుందన్నారు. జాతీయ పక్షిని కాపాడిన మాజీ ఎంపీటీసీ రెడ్యానాయక్‌ను ఫారెస్టు అధికారులు అభినందించారు.

శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలి



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధర్మారెడ్డి, ఎంపీ దయాకర్, నాగుర్ల తదితరులు

సంగెం : ఛత్రపతి శివాజీ పరిపాలన రాష్ట్రానికి ఆదర్శమని ఆయన స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆశాలపల్లి గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, రాష్ట్ర రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివాజీ పోరాట పటిమ, యుద్ధ నైపుణ్యం గురించి నేటి యువత తెలుసుకోవాలని ఎన్నో యుద్ధాలు చేసినా హింసను ప్రోత్సహించలేదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆరెసంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ, ఆగ్రోస్ మాజీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ బొల్లెబోయిన కిశోర్‌యాదవ్, ఎంపీటీసీ చిదురాల రజిత, విగ్రహ దాత దోబిల కమలబాయి, రాజయ్య దంపతులు, ఆరెకుల సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న విభేదాలు..

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆరెకుల సంక్షేమ సంఘంలోని నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ తదితర నాయకులు ఆగ్రోస్ మాజీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావుల మధ్య విభేదాలు వాగ్వాదానికి, రసాభాసకు దారి తీసింది. ఎమ్మెల్యే ధర్మారెడ్డి, ఎంపీ దయాకర్‌లతో కలిసి కిషన్‌రావు ముందుగానే గ్రామానికి చేరుకోగా నాగుర్ల, చెట్టుపల్లి శివాజీ తదితరులు ఆలస్యంగా చేరుకున్నారు. అందరు కలిసి విగ్రహావిష్కరణ తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో అతిథులను స్టేజీ మీదకు పిలుస్తుండగానే కిషన్‌రావు ఎమ్మెల్యే, ఎంపీలతో వెళ్లి కూర్చోగానే నాగుర్ల తదితరులు ఆరె సంఘం నుంచి బహిష్కరించిన నేతతో వేదిక పంచుకోమంటూ స్టేజీపైకి వెళ్లకుండా ఉండడంతో పలువురు గోబ్యాక్ లింగంపల్లి అంటూ నినాదాలు చేశారు. దీంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కుల సంఘంలో ఉన్న విభేదాలకు ఇది వేదిక కాదని ఎమ్మెల్యే, ఎంపీ హితవు చెప్పి వెళ్లిపోయారు. ఆ తర్వాత నాగుర్ల, చెట్టుపల్లి శివాజీ తదితర నాయకులు స్టేజీపైకి వచ్చి సమావేశం నిర్వహించడానికి ప్రయత్నించడంతో స్థానిక నేతలు ఎమ్మెల్యే, ఎంపీలు వెళ్లిన తర్వాత ఇంకా సమావేశం ఎందుకని మైక్ కట్ చేయించడంతో నాయకులు వెనుదిరిగారు. కాగా స్థానిక ఆరె సంఘం నాయకులు దాతల సహకారంతో శివాజీ విగ్రహం ఏర్పాటు చేసుకుని ఆవిష్కరించుకుంటే కుల సంఘం విభేదాలతో సమావేశం రసాభాస ముగియడంతో ఆరెకులస్తులతో పాటుగా గ్రామస్తులు, నేతలు రాష్ట్ర నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



నర్సంపేట: నినాదాలు చేస్తున్న ఆరె కులస్తులు



రాయపర్తి: బైక్ ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు



చెన్నారావుపేటలో యువకుల శోభాయాత్ర

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఆరెకుల సంక్షేమ సంఘం మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి ఆరె కులస్తులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మలహల్‌రావు, సాంబశివరావు, రామ్‌రాజ్, రామారావు, సంబాజీ, శ్యామరావు, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వెంకటాపురం, శివాజీనగర్, రేకంపల్లి, మదిర, చాపలబండ, మందపల్లి, గిర్నిబావి, బంధంపల్లి, లక్ష్మీపురం, గోపాలపురం, స్వామిరావుపల్లి గ్రామాలలో శివాజీ జయంతిని నిర్వహించారు. అన్నీ గ్రామాలలో కులసంఘం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు మోర్తాల చందర్ రావు, హింగే భుజంగరావు, సుకినె రాజేశ్వర్ రావు, వలిగె నర్సింగరావు, గుండెకారి రవికుమార్, లాండే రమేష్, మడతలపాటి ఆనంద్, సుకినె శ్రీనివాస్, రామారావు, రాజు, రాజేశ్వర్‌రావు, మోహన్‌రావు, లింగంపల్లి రవీందర్, సోనిరతన్, మనోహర్ పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండలంలోని చెన్నారావుపేట, కోనాపురం గ్రామాలలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో యువకులు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై తోట మహేందర్ పాల్గొని మాట్లాడారు. యువకులు మౌనిక్‌రెడ్డి, కంకల రాజు, గాధగోని విక్రమం, సాయి గణేష్, మంగ రవితేజ, మహ్మద్ వసీం అక్రమ్, రాసమల్ల సతీష్‌లు ఉన్నారు. కోనాపురంలో కుల పెద్ద గుజ్జుల బాబురావు, మండల అధ్యక్షుడు కొడగాని రాజీరు, గ్రామ అధ్యక్షుడు అంబీరు వీరన్న, శంకర్‌రావు, లక్ష్మణ్‌రావు, బక్కయ్య, తదితరులు ఉన్నారు.



వర్ధన్నపేట: శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



దుగ్గొండి: మదిరలో శివాజీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఆరెకుల సంఘం నాయకులు



చెన్నారావుపేట: కోనాపురంలో..

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట : ఆరెకులస్తులు ఆరాధ్య దైవంగా కొలిచే ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల శివాజీ విగ్రహం వద్ద గ్రామపెద్ద కొడగాని రాంబాబు శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత మాత ముద్దుబిడ్డ శివాజీ మొఘల్ సామ్రాజ్యంపై పోరాడిన మరాఠ యోధుడన్నారు. ధైర్యానికి, ధీరత్వానికి, దేశభక్తికి మారుపేరుగా నిలిచారన్నారు. ఆరె కులస్తులను ఓబీసీ సర్టిఫికెట్ కోసం ప్రభుత్వం నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను కోరడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజేష్‌ఖన్నా, మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, మోతాజీ, జన్ను రాములు, బచ్చల స్వామి, యాదగిరి, ఆరె కులస్తులు పాల్గొన్నారు.

రాయపర్తిలో..

రాయపర్తి : మండలంలోని బందనపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను యంగ్ వారియర్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రం నుంచి బందనపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ చేసిన సేవలను కొనియాడుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు మైనాల హరీష్, మైనాల నరేష్, కొడగాని సిద్ధు, శ్రావణ్, లడే జయంత్, రాజేందర్, శివాజీ, ఆరె కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్లను సస్పెండ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్

పరకాల : విధులకు సక్రమంగా హాజరుకానీ పరకాల ఎస్ఎంహెచ్ హాస్టల్స్ వార్డెన్లను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పరకాల పట్టణంలోని ఎస్ఎంహెచ్ బాలుర, బాలికల హాస్టల్స్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం సందర్శించి, మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా వారి ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని శ్రీకాంత్ మండిపడ్డాడు. అదే విధంగా రెండు హాస్టల్స్‌కు వాచ్‌మన్ లేకపోవడంతో విద్యార్థులు వారి ఇష్టారాజ్యంగా తిరుగుతున్నారని, విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వార్డెన్స్ సక్రమంగా విధులకు రాకపోవడంతో విద్యార్థుల సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. తక్షణమే ఎస్ఎంహెచ్ వార్డెన్స్‌పై చర్యలు తీసుకోని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, మడికొండ ప్రశాంత్ ఉన్నారు.